క్లుప్తంగా

డ్రెయినేజీ వ్యవస్థ పటిష్టతకు అంచనాలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భాను ప్రతాప్

ఏలూరు (టూటౌన్): నగరంలో ప్రధానమైన డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టంగా నిర్మించేందుకు అంచనాలు తయారు చేయాలని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. భారీ వర్షాలు కురిసినా రోడ్లపై నీరు నిలవకుండా ఉండే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను తయారు చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఎమ్మెల్యే చంటి సూచించారని తెలిపారు. సమావేశంలో ఎంఈ సురేంద్రబాబు, డీఈలు, ఏఈలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రిలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఔదార్యం..



రక్తదానం చేస్తున్న ఏసీబీ కానిస్టేబుల్ కిషోర్

ఏలూరు (టూటౌన్): ఏసీబీ కానిస్టేబుల్ పీతల కిషోర్ 25వ సారి రక్తదానం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఏలూరులోని కానూరు మధవి ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న లింగపాలెం మండలం ముదిచెర్ల గ్రామానికి చెందిన బి.భారతి అనే మహిళలకు ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా బి నెగిటివ్ రక్తం అవసరమైంది. దీని గురించి కానిస్టేబుల్ కిషోర్‌కు ఫోన్ చేయగానే ఏలూరులోని వసుంధర బ్లడ్ బ్యాంక్ నందు 25వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు అభినందించారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో అప్రమత్తం

- తడిచేతితో స్విచ్‌లు, బోర్డులు పట్టుకోవద్దు
- సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి



నగరంలోని అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలరోజులు కావస్తున్నా వర్షాల ప్రభావం పెద్దగా లేదనే చెప్పాలి. అయితే పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని వాతావరణం వానాకాలంలోనే ఎక్కువగా చూస్తుంటాం. అప్పుడే ఎండకాసి, నిమిషాల్లో వాతావరణ మార్పులు చోటుచేసుకుని కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షాలు పడే అవకాశం వానాకాలంలో ఎక్కువగా ఉంటుంది. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి వర్షాలు రావాలని కోరుకుంటాం. కానీ ఒక రోజంతా వర్షం కురిస్తే ఎండలే నయమని కూడా అనుకుంటాం. వర్షాకాలం రావాలని ఎంత ఎక్కువగా కోరుకుంటామో అంతే ఎక్కువగా వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ సంస్థ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. వర్షకాలంలో వానలు, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీటిలోకి దిగాలి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటం, మేడలు, మిద్దెలకు సమీపం నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వర్షాకాలంలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

చేయకూడని పనులు ఇవే

- వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను, స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- సబ్ స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.

ముందస్తు జాగ్రత్తలతో రక్షణ



వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతాయి. వాటిని మరమ్మతులు చేయించడానికి యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు.

– కేఎం అంబేద్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్

ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షం కురిసే, జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచొద్దు.
- చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్గను స్విచ్ ఆఫ్ చేయకుండా తీయకూడదు.
- నిపుణులతోనే ఇళ్లకు వైరింగ్ చేయించాలి.

పథకాలు పొందుతున్న అనర్హుడిపై ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చూపుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సంక్షేమ పథకాలు పొందుతూ ప్రభుత్వానికి ఆర్థిక నష్టాన్ని చేకూర్చుతున్న ప్రభుత్వ రిటైర్ ఉగ్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని న్యాయ శాఖ విభాగం నుంచి పదవీ విరమణచేసిన వ్యక్తి తన భార్య వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నట్లు ప్రభుత్వ అధికారులను నమ్మించి రేషన్ కార్డు, డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి పొందారని ఆరోపించారు. దీనికి బాధ్యులైన రిటైర్డ్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలిక అదృశ్యం

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పేరంటపేటకు చెందిన బాలిక జంగారెడ్డిగూడెంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 13వ తేదీ రాత్రి బాలిక కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించగా మరుసటి రోజు తెల్లవారుజామున 4.30కు చూడగా బాలిక కనిపించలేదు.

ఏఐ బోట్ ఫిర్యాదులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయా సమస్యలపై బాధితుల ఫిర్యాదులను ఏఐ బోట్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసి ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలను అందించాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఏఐ బోట్ అప్లికేషన్‌పై ప్రత్యేక వర్క్ షాప్ సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఐ బోట్ అప్లికేషన్‌తో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తే, ఈ అప్లికేషన్ స్వయంగా వారి వద్ద నుంచి వీడియో రూపంలో ఫిర్యాదులను స్వీకరించి నమోదు చేస్తుందని, ఆయా విభాగాలుగా అది తర్జుమా చేసి తదుపరి ప్రశ్నలను సైతం అదే అడిగి ఫిర్యాదు నమోదు చేస్తుందని పేర్కొన్నారు. ఆటోమేటిక్‌గా బాధితుల ఫిర్యాదు జనరేషన్ అవుతుందని చెప్పారు. తప్పులు లేకుండా ఫిర్యాదును నమోదు చేస్తుందని, కాగిత రహిత ఫిర్యాదులను నమోదు చేయడానికి పారదర్శకంగా ఫిర్యాదుదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐలు సత్యనారాయణ, అశోక్ కుమార్, కోటేశ్వరరావు, సీఐ యూజే విల్సన్, రాజశేఖర్, కైకలూరు సీఐ కృష్ణ , కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, గణపవరం సీఐ రజిని కుమార్, పోలీస్ సిబ్బంది, రిసెప్షన్లలో పనిచేసే మహిళ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీడు వారిన భూములు



నీరులేక బీటలు వారిన నారుమళ్లు



నీటి కోసం రైతన్న ఎదురుచూపులు

- దెందులూరు నియోజకవర్గంలో నారుమళ్లకు అందని సాగు నీరు
- 450 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

దెందులూరు: దెందులూరు మండలంలో సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతన్నాయి. పోతునూరు, కేదవరం, గుండుగొలనుతో పాటు దెందులూరు శివారు ప్రాంతాల్లో 450 ఎకరాలకు పైగా పొలాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. గోదావరి కాలువకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఈ పరిస్థితి ఉండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఎవరికి చెప్పాలో తెలియక ఎప్పుడు నీళ్లు వస్తాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం వందల ఎకరాల్లో సాగునీరు లేక పంట ఎండుతున్నా.. పట్టించుకోకపోవడంపై రైతులు, రైతు కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా కనీసం ఏం జరుగుతుందో.. పరిశీలన కూడా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఉద్యోగులు పట్టించుకోకపోతే జిల్లా అధికారులకు ఈ విషయం ఏం తెలుస్తుందని.. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో కూడా లేకపోతే తమ సమస్య ఎప్పటికీ పరిష్కారం అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తూర సైజు పెంచాలి



ఉండ్రాజవరం దగ్గర కొత్తచెరువు బోదె వద్ద తూర పెంచాలి. తూర సైజు చిన్నగా ఉండటం వల్ల సాగునీటి సమస్య తలెత్తింది. సమస్య వెంటనే పరిష్కరించాలి.

చెన్ను లక్ష్మణ, రైతు

50 ఎకరాల్లో సాగునీటి సమస్య



కేదవరం, పోతునూరు, గుండుగొలను గ్రామాల్లో 450 ఎకరాలకు సాగునీటి సమస్య ఉంది. రైతుల సమస్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎవరికి చెప్పాలో ఎవరు పరిష్కరిస్తారో అర్థం కావట్లేదు.

మురల సత్యనారాయణ, రైతు

పట్టించుకోని అధికారులు



జిల్లా అధికారులు ఎప్పుడు వస్తారో.. సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో అర్థం కావడం లేదు. మూడు గ్రామాల్లో సాగునీరు లేకపోతే సమస్య కాదా.. మీరు పట్టించుకోరా ?

సరగల స్వామి, రైతు

ఆక్రమణకు గురైన వాగు



వాగును ఆక్రమించేశారు. పంట కాలువలు వెడల్పు చేయాలి. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సమష్టిగా పరిశీలించి ఆక్రమణలు తొలగించడానికి ఇబ్బంది ఏంటి?

–పడమట నాగేశ్వరరావు, రైతు

జగన్ రైతును రాజు చేశారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతును రాజుగా చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయం అనుసంధానం చేశారు. పంట పెట్టుబడి సాయం విధిగా అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీడు వారిన భూములకు సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

డీబీఆర్‌కే చౌదరి ,వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి

కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తాం



13వ డివిజన్‌లో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీపై క్యూ ఆర్ కోడ్ ఫ్ల కార్డుల ప్రదర్శన



ఏలూరు 1వ డివిజన్‌లో పార్టీ కార్యాలయంలో..

వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రతి వ్యక్తికీ కూటమి ప్రభుత్వ మోసపు పాలనపై అవగాహన కల్పించేందుకు గడప గడపకూ వెళ్తామని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు నగరంలో 1, 2, 13వ డివిజన్‌లలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పేరుతో ఏలూరు నియోజకవర్గంలో ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. పార్టీ నాయకులు డివిజన్‌లో సోమవారం రాత్రి బాబూస్ మేనిఫెస్టో రీకాల్ అంటూ క్యూ ఆర్ కోడ్ ఫ్లకార్డులు ప్రదర్శించారు. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంయుక్తంగా ఏ విధంగా ప్రజలకు హామీలు ఇచ్చిందో ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికి హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యారని విమర్శించారు. యువతను దారుణంగా మోసగించారన్నారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారని, లేకుంటే రూ.3 వేల నిరుద్యోగ భతిని ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఉద్యోగాలు భర్తీ సంగతి పక్కనపెడితే ఉన్న ఉద్యోగాలు పీకేస్తున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేసి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరసు చిరంజీవి, జాన్ గుర్నాథ్, జిజ్జువరపు విజయనిర్మల, జీఎంఆర్, పల్లి శ్రీనివాస్, మల్లిక్, మాచర్ల లోకేష్, వెంకటేశ్, బండ్లమూడి సునీల్, బసవ, గణేష్, తులసి వర్మ, రాము ,పల్లి వెంకటేష్, చంటి, సత్తి బాబు, రాము, నక్క లక్ష్మణరావు, మోషే, మోభిన, దేవి, బుట్టి మణి, స్థానిక నాయకులు ,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'కు ఎగనామం

కుక్కునూరు: కూలి పనులకు వెళ్లే ఓ మహిళకు కారు ఉందని సాకు చూపి తల్లికి వందనం పథకానికి ఎగనామం పెట్టింది కూటమి ప్రభుత్వం. వివరాలు ఇలా ఉన్నాయి, కుక్కునూరుకు చెందిన పరిటాల నాగమణికి ఇద్దరు సంతానం. వారిద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9,7 వ తరగతులు చదువుతున్నారు. ప్రభుత్వం ఇటీవల తల్లుల ఖాతాల్లో జమ చేసిన తల్లికి వందనం సొమ్ము రూ13 వేలు ఆమె ఖాతాలో జమకాలేదు. ఈ విషయమై నాగమణి గ్రీవెన్స్‌లో దరఖాస్తు సమర్పించినా ఫలితం లేదు. దీంతో సోమవారం సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా నాగమణి నల్లకుంటలో ఉంటున్నట్టు హౌస్ హోల్డ్ డేటాలో పేర్కొనడంతో పాటు ఆమెకు కారు ఉన్నట్టు నమోదు చేయడంపై ఖంగుతింది. కూలి పనులకు వెళ్లే తమకు కారు కొనుక్కునే స్థోమత ఎక్కడిదని వాపోయింది. ఈ విషయమై అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకొంది.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలను చూపుతున్న ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ అరుణ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ట్రీస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో ద్వారా వైఎస్ఆర్ నగర్ ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 102 మంది విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాంజిలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం ఉచిత నోట్ పుస్తకాలు అందిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు జీజేఏ స్టీవెన్ మాట్లాడుతూ యాంజిలో పుస్తకాలతో పాటు పాఠశాలకు అవసరమైన డెస్కులు, ప్రహరీ, వాల్ రైటినింగ్స్, గ్రౌండ్ పూడిక, గచ్చు చేయించడం వంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఇన్‌చార్జి హెచ్ఎం పి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ నగర పాఠశాలలో..

దెందులూరు: నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఎంఈఓ అరుణ్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలను అరుణ్ హెచ్ఎం వి.సీతారామయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు

దెందులూరు: గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కారానికి కృషి చేయాలని ఏలూరు తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్లు నాగమణి, ప్రియ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్, అన్ని గ్రామాల వీఆర్‌ఓలతో గ్రామాల వారీగా సమీక్ష చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 21 నుంచి ఉచితంగా సెల్ ఫోన్ రిపేరింగ్ 30 రోజులు(పురుషులకు, స్త్రీలకు), జూట్ బ్యాగ్స్ (జనపనార సంచులు) 14 రోజులు (మహిళలకు మాత్రమే) శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం ఫణికిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తిచేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుంచి సర్టిఫికెట్, అర్హులకు ముద్ర రుణాలకు సిఫారసు చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 99485 65256లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

యువత ఆర్థికంగా ఎదగాలి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): యువత జీవితాన్ని అందంగా మలుచుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజనీరింగు కళాశాల సమావేశ మందిరంలో సోమవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 42 ప్రముఖ కంపెనీలు ద్వారా 3,500 పైగా యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో 42 జాబు మేళాలు నిర్వహించి 2,400 ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఉద్యోగ మేళాలు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ విద్య, ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ కె.ప్రతాపశివ కిషోర్, ఎమ్మెల్యే బడేటి చంటి, ఏపీ ట్రికర్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, హుడా చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాదు, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్ జితేంద్రబాబు, సీఆర్ రెడ్డి కళాశాల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోరుతూ వినతి

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారు లేక వారి భవిష్యత్తు అంధకారంలో ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు జరిగి నెలలు కావస్తున్నా ఇక్కడ టీచర్ పోస్టుల భర్తీ చేయడంలో విద్యాశాఖ మొద్దు నిద్ర ప్రదర్శిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో ఖాళీగా ఉన్న 78 టీచర్ పోస్టులతో పాటు రెగ్యులర్ ఎంఈఓను కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఉపాధ్యక్షుడు కురాకుల బాబు రావు, రవ్వా ఉంగా, రవ్వా భీమా పాల్గొన్నారు.